ఆరాధన

వసుంధర

"రండి—కూర్చోండి—" అంది సీతమ్మ.

"డిటెక్టివ్ గారు సరిగ్గా అయిదు నిముషాల్లో వస్తారు. టైము వేస్టు కాకూడదనుకుంటే మీరు మాకు విశేషాలు చెప్పుకోవచ్చు—" అంది రాజమ్మ.

అతడికి నలభై యేళ్ళుంటాయి. మరీ పొట్టి కాదు. పొడవూ కాదు. మరీ లావూ కాదు. సన్నం కాదు. మరీ తెలుపూ కాదు. నలుపూ కాదు.

మనిషి మాత్రం ధనికుడిలా వున్నాడు. ముఖం గంభీరంగా వుంది.

అతడు కూర్చోలేదు. రాజమ్మవంక చురుగ్గా చూసి—"మీతో విశేషాలు చెప్పుకునే వయసు కాదు నాది—" అన్నాడు.

"నే నన్నది కేసుకు సంబంధించి!" అన్నదామె వెంటనే.

"మీతో నా సమస్యలు చెప్పుకుంటే అది సమయం

వృధా చేయడం కిందే వస్తుంది. డిటెక్టివ్ వెంకన్నగారి కోసం యెంతసేపైనా యెదురు చూస్తాను—" అన్నాడతడు.

రాజమ్మ చిన్నబుచ్చుకున్న ముఖంతో—"మా వయసు తక్కువ కావచ్చు. కానీ అనుభవం తక్కువ కాదు—...." అంది.

"చూడమ్మా! అందమైన అమ్మాయిలు అనుభవం తక్కువంటేనే వినడానికి సొంపుగా వుంటుంది—" అన్నాడతడు.

అతడి మాటలకు రాజమ్మకూ, సీతమ్మకూ కూడా కోపం వచ్చింది. కానీ ఇద్దరూ మాట్లాడలేదు. క్లయింట్ వెళ్ళిపోతే— అందుకోపం కారణమైతే—జాన్‌కు నచ్చినా నచ్చకపోయినా—అతడంటే అభిమానమున్న ఆ అసిస్టెంట్లిద్దరికీ నచ్చదు.

ఒక్క నిముషమాగి—"చూడమ్మా! అయిదు నిమిషాలూ అయిపోయాయి. డిటెక్టివుల కక్కడా టైము విలువుండదా?" అన్నాడాయన.

అప్పుడు వెంకన్న ఇంట్లోనే వున్నాడు. అతణ్ణి భార్య ఫోన్ చేసి వంటింట్లోకి పిలిచింది. వెంకన్న భార్య పద్మావతి సాధారణంగా ఆఫీసుగదికి రాదు. అతణ్ని పిలవడానికి వంటింటికీ—ఆఫీసుగదికీ ఫోను. అయితే ఫోను అవసరం లేకుండానే ఆఫీసులో జరిగే విషయాలన్నీ ఆమెకు వినిపిస్తూనే వుంటాయి.

పద్మావతి ఎంత మంచిదో అంత గంభీరంగానూ వుంటుంది. అసిస్టెంట్లిద్దరికీ వెంకన్నదగ్గర ఎంత చనువో—పద్మావతంటే అంత భయం.

వెంకన్న యింకా రావడంలేదని సీతమ్మ వంటింట్లోకి

ఫోన్ చేసింది. ఆతకల గొంతు వినగానే భయంగా రిసీవర్ రాజమ్మ కందించింది. రాజమ్మ ఫోన్ అప్రయత్నంగానే అందుకుంది కానీ సీతమ్మెందుకు భయపడిందో ఆమె కర్థం కాకపోలేదు.

"హాలో! యెవరూ మాట్లాడరేం?" అంది పద్మావతి గొంతు మరోసారి.

"ఒక క్లయింట్ వచ్చారు...." అంది రాజమ్మ.

"వస్తే కూర్చోమనండి... "

"అన్నామండి. కానీ ఆయన నిలబడే వున్నారు... "

"అవసరంపడి వచ్చిన వాళ్ళు కాసేపెదురు చూడాలి."

"చాలా సేపట్నుంచి ఎదురు చూస్తున్నారండి...."

"సరే—ఇంకో అయిదు నిమిషాల్లో వస్తానని చెప్పు" అని ఫోన్ పెట్టేసింది పద్మావతి.

"ఇంకో అయిదు నిమిషాల్లో వస్తారుట—...." అంది రాజమ్మ.

"ఎవరూ—వెంకన్నగారేనా మాట్లాడత...."

"కాదండి—వారి శ్రీమతి. ఆమెతో మాట్లాడే ధైర్యం ఈ ఆఫీసులో నాకు మాత్రమే వుంది—...." అంది రాజమ్మ గర్వంగా.

సీతమ్మ మూతి మూడు వంకర్లు తిప్పింది.

ఆ అసిస్టెంట్లిద్దరూ ఒకరి మీదొకరు అధిక్యత చూపించుకోవాలని ప్రయత్నిస్తూంటారు. వచ్చిన అవకాశాన్నిద్దరూ వదులుకోరు.

"ఆయన భాగ్య అయిదు నిమిషాలన్నదా? అయితే కూర్చుంటాను—" అని అతడు కుర్చీలో కూర్చున్నాడు.

2

ఫోన్ వచ్చే సమయానికి వెంకన్న పచ్చడి రుబ్బుతున్నాడు.

ఆ యింట్లో మిక్సీ, వెట్ గ్రైండర్ వగైరా ఆధునిక సామగ్రులన్నీ వున్నాయి. పనిమనుషులూ వున్నారు.

అయినప్పటికీ భార్య భర్తపై ప్రేమను చూపించుకునేందుకు—అప్పుడప్పుడు తనే అన్ని పనులూ చేస్తూండాలన్నది పద్మావతి సిద్ధాంతం. అందుకో రోజు ఎన్నుకుని—ఆ రోజు పనిమనుషులకు సెలవిచ్చేస్తుంది. యంత్ర సామగ్రికీ సెలవిచ్చేస్తుంది. ఆ రోజు ఇల్లూడ్చడం దగ్గర్నుంచి, బట్టలుతకడం దగ్గర్నుంచి—అన్ని పనులూ తనే స్వయంగా చేస్తుందామె.

ఆ రోజు ఈ రోజు.

భర్త కిష్టమైన పెసరపచ్చడి రుబ్బురోట్లో వేసి రుబ్బుతోందామె. సగంలో ఆమెకు చేయి బెణికింది. ఫోన్ చేసి భర్తను పిలిచింది.

వెంకన్న వెళ్ళాడు. పరిస్థితి విని తనే రుబ్బురోలు ముందు కూర్చున్నాడు.

అతడు రుబ్బుతూంటే కుతూహలంగా అతడి ముఖంలోకే చూస్తోందామె.

అనుభవమున్నవాడిలా చక్కగా చేతులు కదుపుతూ రుబ్బుతున్నాడతడు.

పద్మావతి అతడితో కబుర్లు చెబుతోంది. ఈలోగా ఫోన్ వచ్చింది.

విసుగ్గానే తీసింది పద్మావతి. ఆమె ఫోన్ పెట్టేస్తూంటే—"ఏమిటయిందిట?" అన్నాడు.

"ఎవరో క్లయింట్ వచ్చారుట—యింకో అయిదు

నిమిషాలు కూర్చోమన్నాను—"

"అయిదు నిమిషాల్లో రుబ్బడం పూర్తికాదేమో—" అన్నాడు వెంకన్న.

"సరే—ఆ పనేదో నేనే చూసుకుంటాను. మీరు మీ డిటెక్టివ్ చాదస్తంలో చేతులు కడుక్కోటందుకే అయిదు నిమిషాలు పడుతుందని తెలిసి అలా చెప్పాను. వెళ్ళి చేతులు కడుక్కోండి—" అంది పద్మావతి.

"మరి—నీ పచ్చడి—...."

"నేనే రుబ్బుకుంటాను—" అంది పద్మావతి.

"నీ చేయి బెణికింది కదా—...."

"చెయ్యేం బెణకలేదులెండి. మీకు నామీదింకా ఎంత ప్రేముందో తెలుసుకుందామని అలా చెప్పాను..." అంది పద్మావతి.

వెంకన్న దీనంగా ముఖం పెట్టి—"దేవీ! నువ్వెప్పుడప్పుడు నా ప్రేమననుమానిస్తున్నావు కదూ!" అన్నాడు.

"అనుమానించక ఏం చేయను? నిక్షేపంలా వుంటే నన్నొక్క క్షణంకూడా పట్టించుకోరు మీరు సరదాగా మీతో కబుర్లు చెప్పాలనిపించింది. మామూలుగా అయితే రారు. అందుకే పిలిచి చెయ్యి బెణికిందన్నాను. మీరిక్కడ ఆగిపోతారు. నేను కబుర్లు చెప్పి సరదా తీర్చుకుంటున్నాను. ఆమాత్రానికే మీ అసిస్టెంటొస్తేలేక ఫోన్ చేశారు...."

వెంకన్న లేచి చేతులు కడుక్కుంటూ—"పాపం—వాళ్ళేం చేస్తారు? క్లయింట్ వచ్చాడుగా—...." అన్నాడు.

"క్లయింటొచ్చినా రాకపోయినా అదో వంక.

మిమ్మల్ని చూడకుండా వాళ్ళుండలేరు....” అంది పద్మావతి.

వెంకన్న మాట్లాడలేదు.

“నేను చాలా తెలివితక్కువ పనిచేశాను. బాగా వయసు ముదిరిన ఏ రెండో పెళ్ళివాణ్నో చేసుకోవాల్సింది నేను. ఎప్పుడూ నా చుట్టూ తిరుగుతూండేవాడు” అంది పద్మావతి

“ఊరికే కలర్లు చెబుతావుగానీ—నన్ను పెళ్ళాడేక నా పదకులే నీకు నచ్చుతున్నాయి. ఇందాక చేయి వేటి కిందన్నట్లే ఇప్పుడీ మాటలు అంటున్నావు—.... అవునా?” అని ఆమె యెక్కడ కాదంటుందోనన్న భయంతో గబగబా చేతులు తుడుచుకుని వెళ్ళిపోయాడు వెంకన్న.

తనన్న మాటలతో వెంకన్న భయంటేను సంబంధముందని తెలియని పద్మావతి భర్తను తల్చుకొని ముసిముసిగా నవ్వింది.

చలాకీగా పచ్చడి రుబ్బుతున్న భర్త ఇంకా ఆమె కళ్ళముందు మెదులుతున్నాడు.

3

డిటెక్టివ్ వెంకన్న తన సీట్లోకి వచ్చి కూర్చోగానే “మీరేనా—వెంకన్న? పేరు విని చాలా పెద్దవారై ఉంటారనుకున్నాను—” అన్నాడతను.

“నేను జ్ఞానవృద్ధుణ్ణి — మీ పేరు?” అన్నాడు వెంకన్న.

“నా పేరు ఉమాపతి—” అన్నాడతడు.

“మీ సమస్యేమిటి?”

అతడు సీతమ్మ, రాజమ్మల వంక అనుమానంగా

చూశాడు.

"వాళ్ళు నా అసిస్టెంట్సు, కడు సమర్థులు—"
అన్నాడు వెంకన్న.

"ఆ విషయం వాళ్ళుకూడా చెప్పుతున్నారు—"
అన్నాడుమాపతి.

"మీ సమస్యేమిటో చెప్పండి—...." అన్నాడు వెంకన్న.

"వీళ్ళముందు చెప్పాలంటే నాకు మొహమాటంగా ఉంది. మనమిద్దరూ యేకాంతంలో మాట్లాడుకుందాం—" అన్నాడుమాపతి.

"నా భార్యతో ఉన్నప్పుడు కూడా వీళ్ళు నా యేకాంతానికి భంగం కలిగించరు. వీళ్ళిక్కడ లేరనే అనుకోండి. నా అసిస్టెంట్సుగా ఎంత సమర్థులో— ఏకాంత విషయాల్లో అంత మొద్దులు. మీరు మీ సమస్య చెప్పుకోండి—" అన్నాడు వెంకన్న.

"మా యింటి పక్కనే ఓ ముసలాయన కొత్తగా అద్దెకు దిగాడు ఆయన భార్య మహా పడుచుది—" అంటూ ప్రారంభించాడుమాపతి.

అతడు చెబుతూంటే నోట్సులా సీతమ్మ, రాధమ్మ— ఇద్దరూ రాసుకుని పోతున్నారు.

ముసలాయన పేరు రామకృష్ణయ్య. ఆయన వయసు అరవైకి తక్కువుండదు. ఆయన భార్య వేణి—ఆయనకు మనుమరాలులా కనబడుతుంది. పదహారేళ్ళ పిల్లలా కనబడుతుంది కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమె వయసు ఇరవై దాటదు. తీర్చిదిద్దినట్లుంటుందామె అవయవాల పొందిక.

చెప్పాలంటే ఆమెది అద్భుత సౌందర్యం. ఒకసారి

ఆమెను చూసినవారు మరోసారి చూడకుండా ఉండలేరు. మరోసారి చూసినవారు చిరునవ్వు నవ్వకుండా వుండలేరు. చిరునవ్వు నవ్వినవారు పలకరించకుండా ఉండలేరు. అంతవరకూ చెప్పి ఊరుకోనడం మర్యాద.

వేణి కేవలం సౌందర్యవతి మాత్రమే కాక — ఒక ముసలివాడికి పడుచు భార్య కావడంవల్ల చాలామంది నామె ఆకర్షించింది. ఎందరికో ఆమె అంటే సానుభూతి. ఆ సానుభూతిలో స్వార్థముంది.

కానీ వేణి ఈ కాలంలో పుట్టవలసిన యువతి కాదు. ఆమె పరమ నిష్టాగరిష్టురాలు. మహాపతివ్రత.

ఏడు గజాల చీర కడుతుంది. ఆమె శరీరాన్ని కప్పడానికి మూడు గజాల చీర చాలు. ముఖానికి రూపాయి కాసంత బొట్టు పెడుతుంది. ఆ బొట్టు ఆమె నుదుట దీపంలా ప్రకాశిస్తూంటుంది. పనులన్నీ మడిగా చేసుకుంటుంది. పరపురుషులామెకు కొడుకుతో సమానం.

నలభై ఏళ్ళ ఉమాపతినికూడా — ఆమె "బాబూ!" అని పిలుస్తుంది తప్ప పెద్దవాడిగా గుర్తించి సిగ్గుపడదు.

ఆమె కట్టు, బొట్టు — ఆమె వయసును దాచడంలేదు.

ఆమె చూపులు, మాటలు — ఆమెపట్ల ఆకర్షణను తొలగించడంలేదు.

ఆమెదంతా నాటకమని చాలామంది యువకుల భావన. చాటుగా కొందరూ, బహిర్గతంగానే కొందరూ ఆమె గురించి ప్రయత్నించి దెబ్బలు తిన్నారు.

వేణి నిప్పులాంటిదన్న వాడుక అచిరకాలంలోనే ప్రచారంలోకి వచ్చింది. ఆ వాడుక సెందరు నమ్మారో తెలియదుకానీ ఉమాపతి మాత్రం నమ్మాడు.

"చాలా విచిత్రంగా వుంది. కానీ ఇందులో మీ

సమస్యేమిటి?" అన్నాడు వెంకన్న ఆశ్చర్యపడుతూ.

"అదీ చెబుతాను—వినండి—" అన్నాడుమాపతి.

వేణికి భర్తంటే గౌరవమూ, భయభక్తులు మాత్రమే కాదు ప్రేమాభిమానాలుకూడా వున్నాయి. అతణ్ని తన భర్తగా చెప్పుకునేందుకూ, అతడి పక్క నిలబడడానికీ ఆమె ఏమాత్రమూ ఇబ్బంది ఫీలవదు. తన భర్తకాట్టే వయసులేదనీ ఆమె అనదు. అతడి పేరు వింటే సిగ్గుపడుతుంది. అతణ్ని తల్చుకోగానే ఆమె కళ్ళు మెరుస్తాయి.

అలాగని రామకృష్ణయ్య భార్యను అబ్బురంగా చూసుకోడు. ఆ విషయంలో ఆయన చాలామంది ముసలి మొగుళ్ళకు విరుద్ధం. అసలతడు భార్యను వెన్నంటి తిరగడు. ఆమె చేసే ప్రతి పనిలోనూ ఏదో వంక పెట్టి సాధిస్తూంటాడు. ఆమె గుణగణాల్ని మెచ్చుకోడు. మాటి మాటికీ చనిపోయిన తన భార్యతో పోల్చి—అది చావడం నా దురదృష్టం—అంటూంటాడు. అందుకు వేణి తప్పు పట్టదు. చనిపోయిన అతడి భార్య స్థాయికి తా నెదగాలని ఆమె తాపత్రయం. భర్త విసుక్కుంటే ఆమెకంతా సహజంగానే వుంటుంది.

వేణి సాధారణంగా ఆ వీధిలోని ముసలి ఆడవాళ్ళతోనే కబుర్లు చెప్పేది. వాళ్ళతోనే ఆమెకు సరిపోయేది. వాళ్ళెప్పుడప్పుడామెపై జాలిపడి—"మీవారికి కోపం మరీ యెక్కువ—" అనేవారు.

వేణి వెంటనే—"అందు కాయన్ను తప్పుపట్టడానికి లేదండీ—నన్ను పెళ్ళాడాకే వారికి కోపం పెరిగింది. తాయారమ్మక్కయ్యమీద ఎప్పుడూ కోపగించుకునేవారు కారు—" అనేది.

తాయారమ్మక్కయ్యంటే రామకృష్ణయ్య మొదటి భార్య. తాయారు తాయారంటూ ఇప్పటికీ ముసలాయన ఆమెను తల్చుకుంటూనే వుంటాడు.

రామకృష్ణయ్య, వేణి—ఇరుగుపొరుగువాళ్ళట. చిన్నప్పట్నించీ ఆ రెండు కుటుంబాలకీ బాగా పరిచయముట. వేణికి ముసలాయనంటే గొప్ప ఆకర్షణగా వుండేదట. ఇంట్లో యెవరికే ఇబ్బందొచ్చినా వేణి వెళ్ళి సాయం చేసేదిట. ఆమె తాయారమ్మను అక్కా అనీ—రామకృష్ణయ్యను బావా అనీ పిలిచేదిట. రామకృష్ణయ్య ఆమెతో సరసాలాడినా ఎవరూ పట్టించుకునేవారు కాదు. వారి వయోభేదమలాంటిది.

ఆ ముసలి దంపతులకు ముగ్గురు పిల్లలు ముగ్గురూ మంచి పొజిషన్స్‌లో వున్నారు. ఏణ్ణర్థం క్రితం తాయారమ్మ పోయింది. ఆమె భర్తకన్ని పనులూ చూసుకునేది. రామకృష్ణయ్యకు చేయి విరిగినట్లయింది. అప్పుడు వేణికి రామకృష్ణయ్యను పెళ్ళిచేసుకోవాలనిపించింది. ఇదామె యింట్లో గొప్ప సంచలనాన్ని సృష్టించింది.

"చేసుకుంటే ఆయన్నే చేసుకుంటాను. లేకపోతే నాకీ జన్మకు పెళ్ళివద్దు—" అని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పింది వేణి.

రామకృష్ణయ్య దగ్గర బాగా డబ్బుంది. ఆయనకు వేణి కుటుంబంవారు బాగా డబ్బు బాకీ వున్నారు. అది చెల్లువేసి రామకృష్ణయ్య ఆమెను పెళ్ళిచేసుకున్నాడు.

ఇది రామకృష్ణ యింట్లోనూ గొప్ప సంచలనాన్ని సృష్టించింది. పిల్లలు ముగ్గురూ పూర్తిగా ఆయనతో తెగతెంపులు చేసుకున్నారు.

రామకృష్ణయ్యకూడా తాయారు జ్ఞాపకాలు బాధి

తున్నాయని అక్కణ్ణించి మకాం మార్చి—ఇక్కడకు వచ్చాడు ఇక్కడ వారికి సుఖంగానే గడిచిపోతోంది.

“మీరు కథ చెబుతున్నారు. సమస్య చెప్పడంలేదు” అన్నాడు వెంకన్న.

“నా సమస్య ఈ కథలోంచే పుట్టుకొచ్చింది—” అన్నాడుమాపతి.

“కాస్త త్వరగా చెప్పండి—” అన్నాడు వెంకన్న.

“నా సమస్య మీకర్థం కావాలంటే ఈ కథ క్షుణ్ణంగా వినాలి. అందుకే ఇదంతా చెబుతున్నాను-” అన్నాడుమాపతి.

ఉమాపతికి పదహారేళ్ళ కూతురు, పన్నెండేళ్ళ కొడుకు వున్నారు. అతడి వయసు నలభైనాలుగు. కొడుకు ఆరేళ్ళ వయసులో ఉండగా భార్య పోయిందతడికి. ఆ తర్వాత పిల్లలను తనే తల్లీ తండ్రీ అయి పెంచాడు.

చాలామంది అతణ్ణి మళ్ళీ పెళ్ళిచేసుకోమన్నారు. ఉమాపతి ఒప్పుకోలేదు.

“సవతి తల్లి పిల్లల్ని బాధపెడుతుందనా?” అన్నాడు వెంకన్న.

“అలాంటి భయం నాకు లేదు. ఆస్తిపాస్తులకు లోటులేదు నాకు. అయినవాళ్ళూ బోలెడుమందున్నారు. అవసరమైతే పిల్లల్ని వాళ్ళాదరిస్తారు అదీకాక అమ్మాయి కెలాగూ పెళ్ళిచేస్తే అత్తారింటి కెళ్ళిపోతుంది. అబ్బాయి కూడా పెద్ద చదువుల్లోకి వస్తే బయటకు వెళ్ళిపోతాడు. నాకింకా బోలెడు జీవితముంది. రామకృష్ణయ్య కుటుంబాన్ని చూసేకనే నేను మళ్ళీ పెళ్ళిచేసుకోవాలను కున్నాను....”

“ఎందుకని?”

"విధం చెడ్డా ఫలితం దక్కాలంటారు. నేను పెళ్ళి చేసుకుంటే నా వయసుకు తగ్గట్లు ఏ నలభై యేళ్ళావిడనో, రెండో పెళ్ళి మనిషినో చేసుకోలేను...." అని సీతమ్మ, రాజమ్మలక్కడున్నందున కాస్త ఇబ్బందిపడుతూ—"చేసుకుంటే చిన్నమ్మాయినే చేసుకుంటాను. అందువల్ల చాలా యిబ్బంది ఉంటాయని భయపడి సందేహించాను. ఇప్పుడు రామకృష్ణయ్య సంసారం చూసేక-మన దేశంలో అరవై యేళ్ళ మొగుణ్ణికూడా అబ్బురంగా చూసుకునే చిన్నవయసు ఆడపిల్లలున్నారని ధైర్యం వచ్చింది. నేనూ అలాంటి పిల్లనే చేసుకుందామనుకుంటున్నాను. రామకృష్ణయ్యతో పోలిస్తే నా వయసు బాగా తక్కువ—" అన్నాడుమాపతి.

"ఇంతకీ నేను మీకేం చేయాలి?"

"మీరు నాకు రెండువిధాల సాయపడాలి...."

వెంకన్నతో పాటు సీతమ్మ, రాజమ్మకూడా అతడు చెప్పబోయేది వినడానికి కుతూహలపడ్డారు.

ఉమాపతి చెప్పడానికి కాసేపు తటపటాయించి చివరకు ధైర్యంచేసి—"రామకృష్ణయ్య అంత వయసులోకూడా తన పెళ్లాన్నెలా ఆకట్టుకున్నాడు? ఆ రహస్యం తెలుసుకుని మీరు నాకు చెప్పాలి!" అన్నాడుమాపతి.

"చాలా బాగుంది. ఇందుకు మీరే మానసిక నిపుణుడినో సంప్రదించాలి. వైద్యుడి సలహా తీసుకోవాలి. డిటెక్టివు దగ్గరకు వచ్చి ఏం ప్రయోజనం?" అన్నాడు వెంకన్న.

"ఉంది—" అన్నాడుమాపతి-"పాశ్చాత్య దేశాల్లో డెభ్భయేళ్ళవాడు పదిహేడేళ్ళమ్మాయిని పెళ్ళి చేసు

ఉన్నా ఎవరూ ఘోరమో, నేరమో, జరిగిందనరు. అదొక వింతగా చెప్పుకుంటారు తప్ప అన్యాయంగా భావించరు. మనదేశంలో అలాకాదు. ముసలాడు పెళ్ళి చేసుకుంటే వాడేదో మహాఘోరం చేసినట్లు చూస్తారు. అందులో న్యాయమెంతో నాకు తెలియదు. వయోభేదం దంపతుల కక్కువుండకూడదా? డబ్బున్నవాడు పడుచు పిల్లను చేసుకోవాలనుకుంటే ఎగతాళి ఎందుకు చేస్తారు? ఇలాంటి ప్రశ్నలు నన్ను తరచుగా బాధిస్తూండేవి.

ఇప్పుడు రామకృష్ణయ్య, వేణి — ఇద్దరూ యెంతో అన్యోన్యంగా కాపురం చేసుకుంటున్నారు. ఈ సమాజం గురించి ఇద్దరూ అంతగా పట్టించుకోవడంలేదు. వేణి తన భర్తనంతలా ఎలా ఆరాధించగల్గుతోంది? అందులో అసహజత్వంలేదూ! ఆ అసహజత్వానికి కారణ మేమిటి? నిజంగా రామకృష్ణయ్యలో వేణికంత ఆకర్షణ వున్నదా? లేక — రామకృష్ణయ్య ఎవరికీ తెలియకుండా రింగ్ మాస్టర్ సర్కస్ జంతువుల్నదుపు చేసినట్లామెను రహస్యంగా బాధలు పెడుతున్నాడా? అదే నిజమైతే ఆమెనతడి బారినుంచి రక్షించాలి కదా!"

వెంకన్న విసుగ్గా — "దంపతులన్యోన్యంగా కాపురం చేసుకుంటుంటే అనుమానించి కేసులు పెట్టేంత తీరుబడి నాకు లేదు...." అన్నాడు.

ఆ వెనువెంటనే బల్లమీద ఫోన్ మ్రోగింది.

వెంకన్న ఫోనందుకొని — "ఏమిటి దేవీ!" అన్నాడు. అది వంటింట్లోంచే వచ్చిందని అతడికి తెలుసు.

"మీరీ కేసు తీసుకోండి —" అంది పద్మావతి.

"ఎందుకు?"

"ఇందాకా నేను మీతో ఏం చెప్పాను? రెండో

పెళ్ళివారైతే పెళ్ళాం చుట్టూ తిరుగుతాడని! ఇప్పుడా అరవై యేళ్ళ మొగాడివాపిల్ల అంతలా ఆరాధిస్తోందంటే ఏదో తిరకాసుంది. ఆడపిల్లలకన్యాయం జరిగితే నేనూరుకోలేను...." అంది పద్మావతి.

"కానీ...." ఏదో అనబోయాడు వెంకన్న.

"మీరు కేసు తీసుకోండి—" అని ఫోన్ పెట్టేసింది పద్మావతి.

వెంకన్న తనూ ఫోన్ పెట్టేసి—"మీకు నావల్ల కావాల్సిన రెండో సాయం చెప్పండి—" అన్నాడు.

"అంటే మొదటిదాని కొప్పుకున్నారన్న మాట...." అన్నాడుమాపతి సంతోషంగా—"అయితే మీరు నా కోసం వేణివంటి పిల్లను చూసి పెట్టాలి. ఎంత ఫీజడిగినా యిస్తాను...."

"నేనేం పెళ్ళిళ్ళ పేరయ్యననుకున్నారా?" అన్నాడు వెంకన్న కోపంగా.

"ఇది పేరయ్యలవల్లనయ్యే పనికాదు. మీవంటి వారి వల్లనే కావాలి..."

"దిసీజ్ టూమచ్!" అన్నాడు వెంకన్న.

సీతమ్మ, రాజమ్మ పరస్పరం ఒకరినొకరు చూసి నవ్వుకున్నారు.

"ఎందుకని?"

"నేనిప్పుడు కనపడిన ప్రతి ఆడపిల్ల వెంటాబడి—వేణిలాంటిదానివా.... వేణిలాంటిదానివా...., అనడుగుతూ పోవాలి...."

"మీకంత శ్రమలేదండీ! చాముండేశ్వరి అని ఓ అమ్మాయుంది. ఆమె అడ్రసిస్తాను. ఆమె నన్ను పెళ్ళి చేసుకోవాలని తహతహలాడుతోంది. ఆమె నన్ను

ప్రేమిస్తున్నట్లుకూడా తెలిసింది. ఆ ప్రేమ నిజమా, నటనా అన్నది తెలుసుకోవాలి మీరు ...” అన్నాడుమాపతి.

“సరే—” అన్నాడు వెంకన్న.

ఉమాపతి వెంకన్నకు అడ్వాన్సుగా వెయ్యిరూపాయలు ఫీజు ఇచ్చాడు. తన అడ్రసు — చాముండేశ్వరి అడ్రసు—ఇచ్చాడు.

4

ఉమాపతి వెళ్ళిపోయేక వెంకన్నకు లోపలికి పిలుపు వచ్చింది.

కంగారుగా వెళ్ళాడతడు. వెడుతూనే అతడడిగిన మొదటి ప్రశ్న—“పచ్చడి రుబ్బడం అయిపోయిందా?” అని.

“కంగారు పడకండి. మిమ్మల్నందుకు పిలవలేదు....”

“మరెందుకు?”

“మొదటి సాయానికి తటపటాయించారు. రెండో సాయానికి వెంటనే ఒప్పేసుకున్నారు. ఆడపిల్లను కల్పుకోని కాసేపు కబుర్లు చెప్పొచ్చనేగా?” అంది పద్మావతి.

వెంకన్న ఉక్రోషంగా—“అదే నిజమైతే మొదటి కేసులోనూ తటపటాయించకన్లేదు. వేణితో మాట్లాడ వచ్చుగా—” అన్నాడు.

“వేణి ఎలాంటిదో ఉమాపతి చెప్పాడు మీకు. వాళ్ళింటికి వెళ్ళినా ఆమె మిమ్మల్ని బాబూ, నాయనా అని పలకరిస్తుంది. భర్తనంటుకుంటుంది కబుర్లకు....”

“అయితే నన్నిప్పుడేం చేయమంటావు?”

"చాముండేశ్వరితో మాట్లాడ్డానికి సీతమ్మనో, రాజమ్మనో పంపించండి...."

"వేణితో నేను మాట్లాడాలా?"

"అబ్బా—అలా! ఆమెతో స్వయంగా నేను మాట్లాడతాను...."

"ఈ కేసు నీదా—నాదా?" అన్నాడు వెంకన్న చిరాగ్గా.

"కేసు మీదెందుకవుతుంది—నాదే? ఇది డిటెక్టివ్ పద్మావతీదేవి పరిశోధిస్తుంది. అసిస్టెంటు వెంకన్న...." అంది పద్మావతి.

"అయితే నేనింట్లో కూర్చుంటాను — గోళ్ళు తీసుకుంటూ...."

"ఈ రోజు మంగళవారం — గోళ్ళు తీసుకుందుకు వీల్లేదు. అయినా నేను మీకులాంటి బాస్‌ను కాదు. నా అసిస్టెంటుకు చేతినిండా పనుంటుంది—...."

"దేవీ—ఆజ్ఞ!" అన్నాడు వెంకన్న.

"ముందు మీ అసిస్టెంటును చాముండేశ్వరింటికి పంపించండి...."

"ఇద్దర్నీనా?"

"అవును....?"

"ఇందాకా ఒక్కర్నే అన్నావు...."

"మీరు సహిస్తారేమోనని చూశాను. కానీ, మీకంత తెలివేదీ?"

"ఇద్దరెందుకు?"

"ఎందుకా?" అంటూ వివరించింది పద్మావతీదేవి.

"అయితే మనమిద్దరం రామకృష్ణయ్యింటికి వెడదాం."

"హమ్మయ్య—.... ఇప్పటికి వేణి పేరు వదిలి రామ

కృష్ణయ్యానడం మొదలు పెట్టారు. అయినా పెళ్ళికి వెడుతూ పిల్లని చంకన పెట్టుకు వెళ్ళి—మీ రెందుకూ నాతో.... ఇంట్లో కూర్చుని గోళ్ళు తీసుకోండి—...."

"ఇందాకా మంగళవారమన్నావు...."

"నేనంటే ఈ రోజు మంగళవారమైపోతుందా? ఈ వేళ మంగళవారం కాదు బుధవారం...." అంది పద్మావతీదేవి.

"కానీ— దేవీ! ఈరోజు నిజంగా మంగళవారమే."

"నేను మీకు దాసీను. నేను బుధవారమంటే మీకూ బుధవారమే!" అంది పద్మావతీదేవి హుందాగా.

వెంకన్న మాట్లాడలేదు.

"మాట్లాడరేమండీ?" అంది పద్మావతి.

"ఈరోజు నీ మాటలకెదురు చెప్పను. నువ్వొచ్చేసరికి వంటకూడా చేసి నీపట్ల నాకుగల ప్రేమను ఋజువు చేసుకుంటాను...." అన్నాడు వెంకన్న.

5

"ఎవరో తలుపు తడుతున్నారు చూడమ్మా!" అంది జానకమ్మ. ఆ సమయంలో ఇంట్లో ఆవిడ కాక కూతురు చాముండేశ్వరి మాత్రమే వుంది.

చాముండేశ్వరి వెళ్ళి తలుపు తీసేసరికి సీతమ్మ, రాజమ్మ కనిపించారు. వాళ్ళెవరో ఆమెకు తెలియలేదు.

"నువ్వేనా చాముండేశ్వరి?!" అంది సీతమ్మ.

"అవును— నేనే—కానీ మీరెవ్వరో నాకు తెలియదు—" అంది చాముండేశ్వరి ఆశ్చర్యంగా.

"కాసేపు కూర్చుని మాట్లాడుకుంటే అన్నీ తెలుస్తాయి' అంది రాజమ్మ.

చాముండేశ్వరి వాళ్ళకోసం చాప తెచ్చి వేసింది.

"ఎవరే—వచ్చింది!" అంది లోపల్నుంచే చాముం డేశ్వరి తల్లి.

"నువ్వు పూజచేసుకో — వచ్చినవాళ్ళు నాకోసం వచ్చారు—" అంది చాముండేశ్వరి. అప్పటికే సీతమ్మ, రాజమ్మ చాపమీద కూర్చున్నారు.

చాముండేశ్వరి వాళ్ళ పక్కనే కూర్చుంది.

"నువ్వు పోతపోసిన బంగారు బొమ్మలా వున్నావు-" అంది సీతమ్మ.

చాముండేశ్వరి నవ్వి — "అందుకే నాకు బంగారపు దుద్దులుకూడా లేవు. నేను పెట్టుకున్న రింగులు నకిలీవి-" అంది.

ఆమె నవ్వులో, ఆమె మాటలో ఆమె పేదరికం స్పష్టంగా గోచరిస్తోంది.

అతి తక్కువ వ్యవధిలో తన పేదరికం గురించి చాముండేశ్వరి వాళ్ళకు చాలా వివరాలిచ్చింది.

చాముండేశ్వరి తండ్రికి నెలకు ఏడొందల ఆదాయం. ఆయనకు నలుగురాడపిల్లల తర్వాత ఓ కొడుకు. పెద్ద కూతుళ్ళిద్దరికీ గంతకు తగ్గ సంబంధాలు చేశాడు. వాళ్ళు ఏదోగుడు బ్రతుకుతున్నామా అన్నట్లు సంసారాలీడు స్తున్నారు. మూడో కూతురు తన దారి తను చూసుకో వాలనుకుంది. ఆమెను మంచి మాటలతో ఓ ధనికుల కుర్రాడు లోబర్చుకొని తర్వాత ముఖం చూడలేదు. ఆమె ఆత్మహత్య చేసుకుంది.

ఆడపిల్ల ఎంత అందంగా వున్నా—డబ్బులేనిదే ఆమె అందం రాణించదు. జీవితంలో అందం కూడు పెట్టదు.

ఈ పరమ సత్యాన్ని అతి చిన్నవయసులోనే గ్రహిం చేసింది చాముండేశ్వరి.

ఇప్పుడామెకు ఇరవై యేళ్ళు. రెండో పెళ్ళివాణ్ణి చేసుకోవాలనుకుంటోంది — మనస్ఫూర్తిగా! సంబంధం కూడా వచ్చింది. చెప్పాలంటే తనే వెతికి ఆ సంబంధం పట్టింది.

సీతమ్మ ఆశ్చర్యపోతున్నట్లు నటించి—"అతడి వయసెంతేమిటి?" అంది.

"ఏమో నలభై దాటేయట...."

"నీకు బాధగా లేదూ?" అంది రాజమ్మ.

"బాధ ఎందుకు?"

"నీలాంటి బంగారు బొమ్మకు పాతికేళ్ళ కుర్రాడు కావాలిగానీ...."

చాముండేశ్వరి ముఖం ఎర్రబడింది — "పాతికేళ్ళ కుర్రాళ్ళకు నేను, నా అందం అక్కర్లేదు. డబ్బుకావాలి. వాళ్ళంటే నాకసహ్యం. అవ్వా కావాలి—బువ్వా కావాలంటే ఎలా కుదురుతుంది? నన్నడిగితే వయసు, అందం ఉండి డబ్బులేని అమ్మాయిలందరూ— పైసా కట్నం కూడా ఇవ్వకూడదు. కట్నం ఇచ్చే అమ్మాయిలు పరమ కురూపులై వుండాలి—"

ఆమె ఆవేశానికాశ్చర్యపడుతూ —"కట్నమడిగారని అలిగి రెండో పెళ్ళివాణ్ణి పెళ్ళాడితే—అందువల్ల లాభం మగాళ్ళకేగానీ ఆడాళ్ళకుండదు—" అంది సీతమ్మ.

"ఎందుకుండదూ? మగాడు వయసులో కాస్త పెద్దయితే పెళ్ళాన్నపురూపంగా చూసుకుంటాడు. ఏటొచ్చీ ఆది మనం దుర్వినియోగం చేసుకోకూడదు. మనంమంచిగా ఉంటే అందలమే ఎక్కిస్తారు. ఆడపిల్ల ఈడైనా మగవాళ్ళతో సుఖపడుతుందని నేననుకోను ఎందుకంటే ఇద్దరక్కల్ని చూస్తున్నానుగదా — వాళ్ళతో అచ్చటా,

ముచ్చటా తీరలేదు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్న వాళ్ళలా ఏడుపుగొట్టు ముఖాలతో ఉంటారు. అందుకే నా అభిరుచికి అలాంటి బ్రతుకుకంటే చావు మేలనుకుంది. నాకైతే చావాలని లేదు. కోరికలన్నీ కొనుక్కుని—దర్జాగా బ్రతకాలి. మొగుడి వయసు గురించిన ఆలోచనే లేదు నాకు...."

అప్పుడు రాజమ్మ మరింత ఆశ్చర్యపడుతూ—"మే మెవరో తెలుసుకోకుండా—అసలు మే మెవరమని అడక్కుండా మాకన్నీ చెబుతున్నావు. అసలు మేమిక్కడికెందుకొచ్చామో తెలుసా?" అంది.

"అన్నీ తెలుసు నాకు—..." అంది చాముండేశ్వరి.

సీతమ్మ, రాజమ్మ ముఖముఖాలు చూసుకున్నారు.

"ఎలా తెలుసు? మే మేమీ చెప్పలేదే!" అంది రాజమ్మ.

"చెప్పక్కర్లేదు—రోజూ జరుగుతున్న అనుభవమే యిది నాకు!" అంది చాముండేశ్వరి.

ఉమాపతి గురించి ఎలాగో తెలిసింది చాముండేశ్వరికి. అతణ్ని పెళ్ళిచేసుకుంటానని తనే యింట్లో చెప్పింది. అతనోసారి వచ్చి పిల్లను చూసుకున్నాడు. స్వయంగా చాముండేశ్వరితో మాట్లాడాడు. ఆమె అతడితో—"మీరు నా కంటికి పాతికేళ్ళ కుర్రాడిలా కనపడుతున్నారు—" అని చెప్పింది. అతడు తన్ను పెళ్ళి చేసుకుంటే అది తన అదృష్టంగా భావిస్తానని చెప్పింది. చేసుకోకపోతే తన దురదృష్టమని కూడా చెప్పింది. డబ్బుతో సుఖంగా జీవించాలని తనకున్న అభిలాష గురించి చెప్పింది. యువకులంటే తనకున్న అసహ్యం వివరించింది.

గంటసేపాయన ఇంటర్వ్యూ చేసి పై విశేషాలన్నీ

తెలుసుకున్నాక ఉమాపతి తృప్తిపడినట్లులేదు. రోజూ అతడి పనుపున యెవరో ఒకరు వచ్చి ఆమెతో కాసేపు మాట్లాడి రెండో పెళ్ళి వాడిగురించి ఆమె అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. మొదట్లో చాముండేశ్వరికిది అర్థం కాలేదు. ఓ వారంరోజులలా జరిగేక అది ఉమాపతి చేస్తున్న పనేనని అర్థమయింది. ఆ తర్వాతనుంచి వచ్చిన వాళ్ళెవరో తెలుసుకోకుండానే ఆమె కూర్చోపెట్టి తన అభిప్రాయాలు చెప్పి పంపించేస్తోంది.

"అతనికంతమంది మనుషులెక్కడ్నించి వస్తారు?" అంది సీతమ్మ.

"అదేమీ పెద్ద కష్టంకాదు. పనిచేసి డబ్బు సంపాదించాలనుకొనే ఆడపిల్లలందరూ లేడీస్ సర్వీస్ సెంటర్లో తమ పేరు నమోదు చేసుకొంటారు. అదొక ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ వంటిది. అక్కడనుంచే సబ్బుల కంపెనీలవాళ్ళు, హెయిరాయిల్ కంపెనీలవాళ్ళు తమ తమ సరుకులను ఇంటింటా తిరిగి అమ్మడానికి ఆడపిల్లల నెన్నుకొంటారు. అంతేకాదు — షాపుల్లో సేల్స్ గరల్స్, హోటల్సులో రిసెప్షనిస్టు పోస్టులకూడా లేడీస్ సర్వీస్ సెంటర్ అమ్మాయిల్ని పంపుతుంది.

మర్యాదగల కుటుంబాలవారందరూ ఇలాంటి విషయాల్లో లేడీస్ సర్వీస్ సెంటర్ మీద ఆధారపడతారు. ఉద్యోగం వచ్చేకకూడా ఆడపిల్ల మానసంరక్షణ బాధ్యత లేడీస్ సర్వీస్ సెంటర్ తీసుకుంటుంది. నగరంలో ఈ సంస్థకు మంచి పేరుంది. తన పనికి ఉమాపతిగారుకూడా ఈ సంస్థ నెన్నుకున్నారు రోజుకి మనిషికి పదిరూపాయలిస్తున్నారాయన ఈ పనికి. అంటే నా గురించి ఇరవై రూపాయలు ఖర్చుపెడుతున్నారాయన రోజుకి. అంతే

కాదు. ఆ పిల్లలాక పాకెట్ టేపురికార్డరు కూడా తెస్తున్నారు. మా సంభాషణ అందులో రికార్డవుతుంది. అదాయన వింటారు— ... "

"ఇవన్నీ ఎలా తెలుసుకున్నావు?"

"డిటెక్షన్ చేసి!" అంది చాముండేశ్వరి—"ఒక రోజున మా యింటికొచ్చిన పిల్లల్ని వెంటాడాను. వాళ్ళేం చేస్తున్నారో తెలుసుకున్నాను. వాళ్ళుమాపతి గారింటికి వెళ్ళారు. వాళ్ళ వెనుకే నేనూ వెళ్ళాను. ఆయన తెల్లబోయి నిజం ఒప్పేసుకున్నారు...."

"ఆ తర్వాత మానేయలేదా మరి!"

"లేదు. ఉధృతం తగ్గిందంతే! రోజూ వచ్చే వాళ్ళిప్పుడు మూడు నాలుగురోజులకొకసారి వస్తున్నారు. నేనాయన్నే వెళ్ళడిగాను. ఆయన చెప్పింది వింటే నాకు జాలివేసింది—"

"ఏం చెప్పారూ?"

"నీ వయసు అందమైన ఆడపిల్ల నన్నే ఆరాధిస్తూ మాట్లాడి—యువతరాన్ని తిడుతూంటే వినడానికి నాకెంతో ఆహ్లాదకరంగా ఉంది. అనీ—నా సమక్షంలో కాకుండా ఇతరుల ఎదుట ...అన్నారాయన—" అంది చాముండేశ్వరి.

ఆమె వివరించగా సీతమ్మకూ, రాజమ్మకూ ఒక విషయం అర్థమయింది.

ఉమాపతికి పెళ్ళి గురించి ఎంత మనసుగా వుందో, అంత సంకోచమూ ఉంది. అతడు చాముండేశ్వరి తనంటే నిజంగా ఇష్టపడుతున్నదీ లేనిదీ తెలుసుకొందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. చాముండేశ్వరి తన్ను ప్రేమిస్తున్నదని వీలైనంత ఎక్కువమందికి తెలియబర్చాలనీ

చూస్తున్నాడు. ఇద్దరందమైన ఆడపిల్లలముందో అందమైన ఆడపిల్ల తనను పొగడాలన్న ఆయన మనస్తత్వం ఆ వయసుకు విచిత్రమేమీ కాదు.

"నువ్వనుకొన్నట్లు మేము ఉమాపతి పంపినవాళ్ళం కాదు. ఉమెన్స్ లిబ్ వాళ్ళం...."

"అంటే?" అంది చాముండేశ్వరి.

"ఇష్టపడ్డానని నీ మనసును మభ్యపెట్టుకొని-నీకంటే ఇరవయ్యేళ్ళకు పైగా పెద్దయినవాడ్ని పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నావు. నీ మనసు మార్చడానికి మేమొచ్చాం."

"అందువల్ల మీకు ప్రయోజనం?"

"స్త్రీలకు న్యాయం చేకూరుతుంది...."

"అందువల్ల నాకు ప్రయోజనం....?"

"నీవు స్త్రీవి కదా...."

చాముండేశ్వరి నవ్వి—"పెళ్ళంటే సహజీవనానికని గ్రహించక తలిదండ్రులముందు గంగిరెద్దుల్లా తలూపి కట్నంకోసం అర్రులుచాచే వర్రివిధవల బారినుంచి ఆడవాళ్ళను రక్షించి—అప్పుడు ఉమెన్స్ లిబ్ పేరును మీరు సార్థకం చేసుకోండి. ఉమాపతిగారు నాకు వరప్రసాదంలా లభించారు. ఆయన్నుంచి మీరు నన్ను రక్షించనవసరంలేదు. ఆయన్నుంచి నాకేవిధమైన అన్యాయమూ జరగడంలేదు—" అంది.

సీతమ్మ, రాజమ్మ లేచినిలబడి ఆమెవద్ద సెలవుతీసుకొన్నారు. బయటకు వచ్చేక—"ఒక మధ్యతరగతి ఆడపిల్ల — చాముండేశ్వరిలా మాట్లాడే ఈ సమాజంలో — పెళ్ళికొచ్చిన ప్రతి యువకుడూ అవమానంతో తలదించుకోవాలి —" అంది సీతమ్మ.

"ప్రస్తుతానికి మనదేశంలో నేరాలు చేసేవాళ్ళే

తలలెత్తుక తిరుగుతున్నారు. పెద్దతలలుగా వుంటున్నారు. అటు చూడు...." అంది రాజమ్మ.

నలుగురు యువకులు దూరాన్నుంచి సీతమ్మను, రాజమ్మను చూస్తున్నారు. వికిలిగా ఏవో వ్యాఖ్యానాలు చేస్తున్నారు.

6

పద్మావతీదేవి పట్టుచీర కట్టుకొని—రూపాయకాసంత బొట్టు పెట్టుకొని నిండు ముత్తయిదువలా రామకృష్ణయ్య ఇంటికి వెళ్ళింది.

వేణి ఆమెను సాదరంగా ఆహ్వానించింది.

పద్మావతి వేణివంక ఆశ్చర్యంగా చూసింది.

ఆలివ్ గ్రీన్ రంగు నేత చీర కట్టుకొన్నదామె. గోచీ పోసి కట్టుకొన్న చీరలో కూడా ఆమె లేతగానే వుంది. పండు ముత్తయిదువ వేషం వేసిన పదహారేళ్ళ పడుచులా వుందామె.

అప్రయత్నంగా ఆమె వేణికి నమస్కరించింది.

"మీరెవరో నాకు తెలియదు...." అంది వేణి.

"మీతో కాసేపు ఏకాంతంగా మాట్లాడాలి...." అంది పద్మావతి.

వేణి వీధి తలుపులు వేసింది. ఆమెను పక్కగదిలోనికి తీసుకొని వెళ్ళింది.

"నెమ్మదిగా మాట్లాడండి, మావారి ఆరోగ్యం బాగా లేదు—" అంది ఆమె.

"ఏమయింది?"

"అత్తి "

"మందేం వాడుతున్నారు ...."

"సొంతిరసం తాగి పడుకొన్నారు. మీరేం చెప్పాలను

కొంటున్నారో చెప్పండి....”

“మీ సాయంకోరి వచ్చాను....” అంది పద్మావతి.

“ఏ విషయంలో?”

“నా వివాహమయింది. షష్ఠి పూర్తి పీటలమీట పక్కన కూర్చోడంకోసం వారు నన్ను పెళ్ళిచేసు కున్నారు....”

“అయితే?”

“నాకు జీవితం తృప్తిగా లేదు గతిలేక ఈ పెళ్ళి చేసుకున్నాను. మనసు పెడదారులు తొక్కుతోంది. ఏం చేయాలో తెలియడంలేదు. నా భర్తనీ విషయాపై తరచు సాధిస్తున్నాను. ఆయనేమో తప్పంతా నాదే నంటున్నారు. నా బుద్ధి మంచిదికాదుట. అందుకే పెడ దారులు తొక్కుతోందిట. అందుకుదాహరణగా మీ గురించి చెప్పారు. నేను నమ్మలేదు. ఆయన మాటల్ని చాలామంది బలపరిచారు. అందుకే మీ దగ్గరకు వచ్చాను....”

“ఎందుకు?”

“ముసలి మొగుడితో కాపురం మీకు నిజంగా తృప్తిగా వుందా?”

వేణి క్షణం కూడా ఆలోచించలేదు—“ఆయన ముసలి వాడని నాకెప్పుడూ అనిపించదు. కొన్ని సమయాల్లో అప్పుడే యౌవనంలో అడుగుపెడుతున్న యువకుడిలాగా, కొన్ని సమయాల్లో అర్థం శుభ్రం ఎరుగని పసిపాపలాగా అనిపిస్తారు.”

“నాకూ నా భర్త అలా అనిపించాలంటే నేనేం చేయాలి?”

“ఇందులో మీరు చేయగలిగిందేమీ లేదు. అంతా మీ

భర్తలో వుంటుంది....”

“అంటే?”

“భాగ్య భర్త నారాధించాలంటే—అందుకు భర్త అన్నివిధాలా సమర్థుడై వుండాలి. ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా—నా భర్తవల్ల నాకు తీరని కోరిక లేదు—” అంది వేణి.

“అంతేనా?” అంది పద్మావతి నిరుత్సాహంగా.

వేణి నవ్వి—“ఈ ప్రపంచంలో నా అంత అదృష్టవంతురాలు లేదని నే నెప్పుడూ అనుకుంటూంటాను—” అంది.

అప్పుడు పద్మావతి తన వానిటీ బ్యాగులోంచి—ఓ చిన్న సీసాతీసి—“ఇలాంటిది వాడితే మగాళ్ళకు పోగొట్టుకొన్న యౌవనం తిరిగి వస్తుందంటారు. నిజమేనా?” అంది.

వేణి ఆ సీసా అందుకొంది.

చిన్న గాజుసీసా అది. చూడ్డానికి సెంటుబాటిల్లా వుంది.

తటపటాయించకుండా మూతతీసిందామె. అంతే! మరుక్షణంలో వెనక్కి వాలిపోయింది.

పద్మావతి ముందుకు వంగి ఆమెనోసారి కదిపిచూసింది. తర్వాత సీసాను తీసుకొని తన వానిటీ బ్యాగులో పడేసుకొంది.

అప్పుడామె చుట్టూ పరిశీలించింది.

గదిలో బీరువా వుంది. తాళాలు బీరువాకే వున్నాయి.

పద్మావతి బీరువాను సమీపించి తాళంతీసి తలుపులు తెరిచింది.

లోపల వెండి సామానుంది. బట్టలున్నాయి. ఓ

పక్కగా వందరూపాయల నోట్లకట్ట వుంది. కట్టలోంచి ఓ నోటు తీసుకొందామె. తర్వాత ఓ క్షణం ఆలోచించి మొత్తం కట్టను బ్యాగులో పడేసుకొంది.

ఆ గదిలో ఆమెకింక ఆకర్షించే వస్తువేమీ కనపడ లేదు.

అప్పుడామె పక్కగదిలోకి వెళ్ళింది.

గదిలో మంచంమీద ఓ వృద్ధుడు నిద్రపోతున్నాడు.

పద్మావతి మంచాన్ని సమీపించింది.

వృద్ధుడి వీపు ఆమెవైపు తిరిగి వుంది.

గదిలో వెలుగు బాగానే వుంది.

వృద్ధుడు ముడుచుకొని పడుకొన్నాడు.

పద్మావతి వానిటీ బ్యాగులోంచి సీసా తీసింది. తన ముక్కు దగ్గర రుమాలుంచుకొని—సీసా మూత వుండగానే మంచంమీదకూ వంచబోయింది.

మెరుపువేగంతో వృద్ధుడు మంచంమీంచి లేచి ఆమె చేతిమీద ఓ దెబ్బేశాడు.

పద్మావతి వెనక్కు పడిపోయింది.

"ఎవరు నువ్వు?" అన్నాడు వృద్ధుడు.

పద్మావతి షాక్ నించింకా తేరుకోలేదు.

వృద్ధుడు మంచంమీద చతికిలబడి—"మా యింట్లో నీకేమిటి పని?" అన్నాడు.

అతడి గొంతు వణుకుతోంది. మాట నీరసంగా వుంది.

తెల్లటి గ్లాస్కో పంచెను లుంగీలా కట్టుకొన్నాడతడు. పైన చేతుల బనియన్ వుంది.

పద్మావతి ఆలోచిస్తోంది.

అతడికి తను లోపలకు వస్తానని ముందే తెలుసా? అవతలి గదిలో తనేం చేస్తున్నదీ కనిపెట్టి చూస్తు

న్నాడా?

"చెప్పు—మా యింట్లో నీకేమిటి పని?"

"నీ భార్యను సులువుగా మోసం చేశాను. నీ ఆరోగ్యం బాగోలేదు కాబట్టి నా పని సులభమైపోతుందనుకొన్నాను. ఈ రోజు నా అదృష్టం బాగోలేదు...." అంది పద్మావతి.

"నువ్వు దొంగవా?" అన్నాడు వృద్ధుడు.

"అవును—" అంది పద్మావతి తలవంచుకొని.

"ఇంకెప్పుడూ దొంగతనం చేయనని మాటిస్తే నిన్ను వదిలిపెడతాను...."

"నన్ను నువ్వు వదిలిపెడతావా?" అంది పద్మావతి ఆశ్చర్యంగా.

వృద్ధుడి కళ్ళలోకి నీళ్ళు వచ్చాయి—"పద్దెనిమిదేళ్ళ వయసప్పుడు నేనూ ఓ దొంగతనం చేయబోయి పట్టుబడ్డాను. ఓ మహాభావుడు నన్ను దయతలచి వదిలిపెట్టడమే కాక-వ్యాపారానికి పెట్టుబడిగా కొంత అప్పు కూడా యిచ్చాడు. దాంతోనే నేను పైకివచ్చాను. అందువల్ల నాకు దొంగలంటే సదభిప్రాయమే వుంది. నీవు చూడ్డానికి చాలా మర్యాదస్తురాలిలా వున్నావు. నిన్ను చూడగానే మంచి కుటుంబంనుంచి వచ్చిన ఆడపిల్ల అనిపిస్తుంది. ఇలాగే నువ్వు జీవితం కొనసాగించావంటే తప్పక చెడిపోతావు. బాగుపడతానంటే నీకు మంచి మార్గం చూపిస్తాను. అది నా బాధ్యత...."

"మీరు నన్ను పోలీసులకు పట్టించరా?" అంది పద్మావతి ఆశ్చర్యంగా.

"అందువల్ల ప్రయోజనమేముంటుంది? నేను నిన్ను మంచిమార్గంలో పెడితే—అందులో నువ్వు పైకివస్తే—

నీ కారణంగా మరికొందరు బాగుపడవచ్చు...." అన్నాడు వృద్ధుడు.

"మీ మనసు బహుదొడ్డది. అందుకే మీ భార్య మిమ్మల్నంతలా ప్రేమిస్తోంది—" అంది పద్మావతి.

వృద్ధుడి ముఖం గంభీరంగా అయిపోయింది—"చెప్పాలంటే వేణి నా ఒళ్ళో పెరిగింది. దానికి నేనంటే వెర్రి అభిమానం. ఆ స్తమానూ నన్నే పెళ్ళిచేసుకొంటాననంటూండేది. నేను దాన్ని మందలిస్తూండేవాణ్ణి. కానీ అది నా భార్య తాయారుకంటే తిరుగుతా నా అవసరాలేమిటో, అభిరుచులేమిటో తెలుసుకొంటూండేది.

తాయారు పోగానే అది నాతో—మీ పనులు మీరు చేసుకోలేరు. ఈ వయసులో మీకు భార్య చాలా అవసరం. నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకొంటాను—అంది. నేనొప్పుకోకపోతే చచ్చిపోతాననికూడా మొండికేయడంతో నాకీ పెళ్ళి తప్పలేదు. నాతో అదేం సుఖపడుతుందో తెలియదు. నామీద ఈగకూడా వాలనివ్వదు. నాకు లేని గొప్పలన్నీ ఆపాదిస్తుంది. ఏ జన్మలోనో నేను చేసుకొన్న పుణ్యం వేణిరూపంలో నన్ను సేవించుకుంటోంది ఏ జన్మలోనో అది చేసుకొన్న పాపం నా రూపంలో దాన్ని సాధిస్తోంది...."

పద్మావతి ఆశ్చర్యంగా ఈ కథ వింది — "మీతో పోలిస్తే ఆమె చాలా చిన్నదనుకొంటాను...." అంది.

"చెప్పాలంటే దానికి నా మునిమనుమరాలి వయసుంటుంది—...." అన్నాడు వృద్ధుడు—"నా ప్రాణాలు త్వరగాపోతే బాగుండును. నా పీడవిరగడై ఏ రెండో పెళ్ళో చేసుకుంటుందేమోనని నా ఆశ.... కానీ నా ప్రాణాలను భద్రంగా కాపాడుకోవడం నాకు తప్పనిసరి

చేసింది వేణి—"

"ఎందుకు?"

"నేనుపోతే తనూ విషం మింగి చచ్చిపోతుందిట."

"విషం మింగడమెందుకు?" అంది పద్మావతి తెలియనట్లు.

"సహగమనం చేస్తే చట్టం ఒప్పుకోదుగా.." అన్నాడు వృద్ధుడు.

ఇది చాలా విచిత్రంగా తోచింది పద్మావతికి. నిజంగానే వేణి రామకృష్ణయ్యనంతలా ప్రేమిస్తోందా? ప్రేమిస్తే ఏమిటూ విశేషం? లేక ఆమె అలా నటిస్తోందా?

రామకృష్ణయ్య వాటంచూస్తే యే క్షణంలోనైనా ప్రాణం పోయేలా వున్నాడు. అతడికి ఆస్తి బాగా ఉన్నట్లుంది. డబ్బుకోసమే ఆమె అతడ్ని పెళ్ళిచేసుకొంది. పడుచు భార్యపై ఏమాత్రం అపనమ్మకం కలిగినా అతడు ఆస్తిని వేరెవ్వరికో రాసేసే ప్రమాదముంది. అందుకని వేణి అతడ్ని ఆషాడభూతిలా నమ్మించి ఆస్తిని సంపాదించాలనుకుంటోంది. భర్త పోయాక రెండో వివాహం ఆమెకు కష్టంకాదు. అందముంది. వయసుంది. డబ్బుంది. ఏ నిరుద్యోగి యువకుడైనా యెగిరి గంతేసి మరీ ఆమెను పెళ్ళాడతాడు.

అంతే అయుండాలి.

దీనికి రామకృష్ణయ్య ఏమంటాడో?

చెప్పడంవల్ల వేణికి నష్టం వాటిల్లదూ?

పద్మావతి వేణి గురించి యెక్కువ బాధపడలేదు. వేణి కావాలని ఈ పెళ్ళి చేసుకుంది. అంటే ఆమె వంచకురాలు. ఎవరో ఆమెకు రామకృష్ణయ్యను బలవంతంగా అంటగట్టలేదు.

పద్మావతి తన అనుమానాన్ని వృద్ధుడికి చెప్పింది.

అతడు నవ్వి—"మంచితనాన్ని సులభంగా నమ్మే సమాజం ఈ ప్రపంచంలోనే లేదు. వేణిని తప్పుగా అర్థం చేసుకున్నందుకు నిన్ను నేను తప్పుపట్టను. నువ్వు ఆమె గురించి కాక నీ గురించి ఆలోచించుకో. ముందా బీరువాలోంచి ఏం తీశావో ఇలా యిచ్చేయ్—" అన్నాడు.

"అంతా చూశావా నువ్వు?" అంది పద్మావతి ఆశ్చర్యంగా.

"లేదు. బీరువా చప్పుడైతే విన్నాను. అంతవరకూ నీ గురించి అనుమానమే రాలేదు నాకు—...." అన్నాడు రామకృష్ణయ్య.

పద్మావతి వ్యానిటీ బ్యాగు ఓపెన్ చేసి నోట్లకట్టను తీసి అతడి ముందు పెట్టి—"ఇవొక్కటే తీసుకున్నాను" అంది.

రామకృష్ణయ్య నవ్వి—"ఇంత డబ్బు తీసినదానివదే దారిన వెళ్ళిపోక — ఇంకా లోపలికెందుకు వచ్చావు? అత్యాశకుపోయి పట్టుబడ్డావు ..." అని—"సరేలే— నీకు కొంత డబ్బిస్తాను. దాంతో నీ పద్ధతి మార్చుకో. నీకింకేదైనా సాయం కావలిస్తే చేస్తాను. అడుగు—" అన్నాడు.

పద్మావతి అతడి పాదాలకు నమస్కరించి—"నువ్వు చాలా గొప్పవాడివి. నీ గొప్ప మనసు సాక్షరించబడే ఆమె నిన్ను పెళ్ళి చేసుకుంది. నీకు వివాహ మయుండక పోతే నేనే నిన్ను పెళ్ళిచేసుకునేదాన్నేమో.... ....నా జీవితపథం మార్చుకొని మళ్ళీ నీకు కనిపిస్తాను...." అంది.

"అయితే నా డబ్బు నీకక్కర్లేదా?" అన్నాడు రామకృష్ణయ్య.

"వద్దు.." అని అక్కడ్నించి కదలింది పద్మావతీదేవి.

7

ముందు వెంకన్న తన అసిస్టెంట్లు తెచ్చిన సమాచారం విన్నాడు. వాళ్ళను మెచ్చుకొని—"ఉమాపతి విషయం నాకిప్పుడు పూర్తిగా అర్థమయింది. రెండో పెళ్ళి చేసుకుందుకతడు చాలా తటపటాయిస్తున్నాడు. కానీ అతనిది చాలా గాఢమైన కోరిక. ఆ కోరికకు బలాన్నిస్తున్నది—వేణి పాతివ్రత్య ధర్మం. చాముండేశ్వరి వేణి వంటిది కాదు. కానీ ఆమెకి మించి భర్త నారాధించగలదు—....." అన్నాడు.

తర్వాత అతడికి లోపల్నుంచి ఫోన్ వచ్చింది.

"దేవీ—వచ్చేశావా?" అన్నాడు వెంకన్న.

"ఆఁ అన్నంకూడా వడ్డించాను—" అంది పద్మావతి.

"విశేషాలేమిటి?" ఆత్రుతగా అడిగాడు వెంకన్న.

"భోంచేస్తూ విందురుగాని...."

వెంకన్న అసిస్టెంట్లవంక చూసి—"ఇది లంచ్ టైం...." అన్నాడు.

"అందుకింకా పది నిముషాలుందిగా—...." అంది సీతమ్మ.

"టైము గురించి మరీ అంత పట్టింపుంటే వాచీని ముందుకు తిప్పుకోండి. భోజనాలయ్యాక మాత్రం వాచీని మళ్ళీ యథాప్రకారం చేసుకోండి ..." అని సలహా ఇచ్చి వెంకన్న లోపలకు వెళ్ళిపోయాడు.

అతడు విశేషాలడగ్గానే—"ముందు భోజనం ప్రారంభించండి—" అంది పద్మావతి ఆజ్ఞాపిస్తున్నట్లుగా.

భార్యాభర్తలిద్దరూ టేబిల్ మీద యెదురెదురుగా కూర్చుని భోజనాలు ప్రారంభించారు.

"త్వరగా ప్రారంభించు మరి!" అన్నాడు వెంకన్న.

"ముందు మీ అసిస్టెంట్స్ సాధించుకువచ్చారో చెప్పండి—"

వెంకన్న వివరంగా భార్యకు చెప్పాడు.

"చాముండేశ్వరికీ జై!" అంది పద్మావతి.

"ఎందుకు?" అన్నాడు వెంకన్న ఆశ్చర్యంగా.

"తను చేస్తున్నది స్వార్థంకోసమేనని నిర్భయంగా చెప్పింది. కట్నాలడిగే మగాళ్ళని వెధవలని పిలిచి నిరసించింది. ఇలాంటి ఆడపిల్లల సంఖ్య దేశంలో పెరగాలి."

"మరి వేణి సంగతేమిటంటావు?"

పద్మావతి జరిగింది చెప్పి—"మీ రేమంటారు?" అంది.

వెంకన్న చిరాగ్గా ముఖం పెట్టి—"ఇంతకీ నువ్వేం తెలుసుకొచ్చినట్లు?" అన్నాడు.

"అంటే?"

"నా అసిస్టెంట్సు ఎన్నో విషయాలు సేకరించుకొని వచ్చారు. నువ్వు తెలుసుకొన్నదాంట్లో కొత్త విశేషాలేం కనబడలేదు నాకు—...." అన్నాడు వెంకన్న.

పద్మావతి ముఖం ఎర్రబడింది—"మీరు నన్ను చిన్న బుచ్చాలనుకుంటే మీతో పోల్చుకోండి. మీ అసిస్టెంట్సుతో పోల్చకండి—...."

"ఒకే పనిమీద ఇద్దరు వెళ్ళినపుడు ఇద్దర్నీ పోల్చడం తప్పనిసరి...."

"మీ అసిస్టెంట్సు వృథా అని నేనంటాను. వాళ్ళు బాగుంటారు. రోజూ వాళ్ళను చూడడం మీకు సరదా. అందుకోసం వాళ్ళకి లేని గొప్పతనాన్నంటగడతారు.

ఇంతకీ వాళ్ళు తెలుసుకువచ్చిన గొప్ప విశేషమేమిటట?
అడక్కుండా అన్నీ చెప్పే అమ్మాయి చెప్పింది విని మీకు చెప్పారు. నేనేమో ఇద్దరు మహానటులున్న ఇంట్లో ప్రవేశించి గూఢచారితనం చేసివచ్చాను...." అంది పద్మావతి.

"అందువల్ల ప్రయోజనం?"

"ప్రయోజనం లేదని మీ రెందుకనుకుంటున్నారు?"

"భార్యాభర్తలిద్దరూ ఆరోగ్యంగా ఉండటంలోని రహస్యం ఇప్పటికీ మనకు తెలియలేదు...."

"నేను తెలుసుకొన్న కొత్త విశేషం—ముసలాడికి ఏ సామర్థ్యమూ లేదని. అతడికి భార్య వర్తమానం గురించీ, భవిష్యత్తు గురించీ చింత వుంది. కాని అతడ్ని ప్రేమించానంటోంది. అది ఋజువు చేయడమే తన జీవిత లక్ష్యంగా పెట్టుకుంది. అందుక్కారణం నిజంగా ప్రేమ అవునా కాదా అన్నది మాత్రం నేను తెలుసుకోలేకపోయాను."

"అక్కడ్నించి పనికొచ్చే ఆధారాలేమీ తేలేదు నువ్వు...."

"అంటే?"

"ముసలాడే ఊరివాడు?"

పద్మావతి నాలిక్కొరుచుకొని — "నిజమే! కానీ వాళ్ళ నడిగితే నిజం తెలియదనిపించింది నాకు. అందుకని వాళ్ళకు సంబంధించిన కాగితాలు, వుత్తరాలు చూడాలనుకున్నాను. ఒక బీరువాలో డబ్బు, నగలు, బట్టలు వున్నాయి. ఇంకో గదికి వెళ్ళగానే ముసలాడు నన్ను పట్టేశాడు—" అంది.

"అందుకే...." అని ఏదో అనబోయి ఆగిపోయాడు వెంకన్న. భోజనాల దగ్గర భార్యను రెచ్చగొట్టడం

అతడికిష్టముండదు.

అతడందుకే అన్నందుకే పద్మావతి పెద్ద రాద్ధాంతం చేసి వుండేది. కానీ ఆమెకేదో స్ఫురించింది. ఆమె అక్కడ్నించి లేచివెళ్ళి మళ్ళీ తిరిగివచ్చింది.

అప్పుడామె చేతిలో వందరూపాయల నోటొకటుంది.

“కట్టను చూడగానే యే దొంగనోట్లో అయుంటా యేమోనని శాంపిల్‌గా ఒకటి తీసి బ్యాగులో వేసుకున్నాను. తర్వాత ఆలోచించగా— మొత్తం కట్ట తీసుకుంటే తప్పు—నన్ను దొంగననుకోరనిపించింది. నేను దొంగననుకోకపోతే వాళ్ళ అనుమానాలు రకరకాలుగా పోతాయి. గూఢచారులెప్పుడూ ఇతరులను తప్పుదారి పట్టించడానికి చూస్తారు. అందుకే మొత్తం కట్టను బ్యాగులో వేసుకున్నాను. కానీ ముసలాడా కట్ట అడిగి తీసుకున్నాడు. ఈ నోటు నా దగ్గర మిగిలింది....”

వెంకన్న యెడం చేత్తో ఆ నోటందుకొని చూశాడు. అతడి ఎక్స్‌రే కళ్ళు నోటును శ్రద్ధగా పరిశీలించాయి.

“ఇది దొంగనోటు కాదు దేవీ!” అన్నాడు వెంకన్న.

“ఎలా తెలుసు మీకు?”

“డిటెక్టివులు గూఢచారులకంటె గొప్పవారు కాబట్టి!”

“సరేలెండి — అయితే దీనివల్ల మీకు ప్రయోజనం లేదన్నమాట?”

“ఇది దొంగనోటు కాదని కచ్చితంగా చెప్పగలను. కానీ ఇది దొంగనోటని నా జ్ఞాపకశక్తి చెబుతోంది...” అన్నాడు వెంకన్న సాలోచనగా.

“అంటే?”

“అర్థం చేసుకుందుకు ప్రయత్నించు—” అన్నాడు

వెంకన్న.

"నాకర్థం కావడంలేదు—" అంది పద్మావతి.

"ఈ కేసు రహస్యమంతా అందులోనే వుంది. నువ్వు తెచ్చిన ఆధారం నాకు చాలా విలువైనది. మంచి కేసును పట్టిచ్చినందుకు ఉమాపతికి ధన్యవాదాలు చెప్పాలో వాలి నేను...."

పద్మావతి భర్త వంక ఆశ్చర్యంగా చూసింది.

వెంకన్న త్వరగా భోంచేసి లేచాడు.

8

"రండి రండి కూర్చోండి—" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నవనీతరావు.

వెంకన్న కూర్చుంటూ — "మీవల్ల నాకో సాయం కావాలి—" అన్నాడు.

"చెప్పండి ..."

"హైదరాబాదులో బ్యాంకు చోరీ గుర్తుందా మీకు? స్టేట్ బ్యాంకాఫ్ ఇండియా.... పాతిక లక్షలు...."

"అవును...."

"మీరు నాకప్పుడా విశేషం చెప్పారు...."

నవనీతరావు సాలోచనగా—"ఇది జరిగి ఏడాదయిందనుకొంటాను—" అన్నాడు.

"అవును...."

వెంకన్న నవనీతరావుకి గుర్తుచేస్తున్నాడు.

హైదరాబాదులో ఒక స్టేట్ బ్యాంకాఫ్ ఇండియా బ్రాంచిలో జరిగింది దొంగతనం. దొంగ చాలా మొండిగా వ్యవహరించాడు.

అతడి చేతిలో పిస్టల్ వుంది. రెండో చేతిలో కాల్క్యులేటర్ వంటి సాధనముంది.

“బ్యాంకులో బాంబు పెట్టాను. నా జోలికివస్తే యే క్షణంలోనైనా అది పేలుతుంది. ఆత్మరక్షణకు నా దగ్గ పిస్తోలుండనే వుంది—” అన్నాడతడు.

ఆ రోజు జీతాలిచ్చేరోజు. బ్యాంకులో క్యాష్ పాతిక లక్షలకు పైగా వుంది.

మొత్తం క్యాషంతా అతడు బ్రీఫ్ కేసులో సర్దించాడు.

ఇద్దరు బ్యాంక్ ఉద్యోగులను తనతో రమ్మన్నాడు.

బయాట ఆటో వుంది.

ముగ్గురూ అది ఎక్కారు.

ఆటో రివ్వున దూసుకుపోయింది. ఆటోలో అతడు మాటలతో బ్యాంకు ఉద్యోగులిద్దర్నీ బాగా బెదరగొట్టాడు.

మధ్య దారిలో తెలివిగా అతడు ఆటో దిగిపోయాడు.

ఆటోను పోలీసు జీపు అనుసరించింది. అతడాటో దిగిన విషయం పోలీసులకు తెలియలేదు. జరిగింది ఆటోను పట్టుకున్నాకనే తెలిసింది.

దొంగ తన ప్రాణాల విషయంలో రిస్కు తీసుకున్నాడు. అందుకు ప్రతిఫలం పాతికలక్షలతడి స్వంతం కావడం.

అయితే కథ అక్కడితో అయిపోలేదు.

దొంగ కాజేసినవన్నీ చాలావరకు కొత్తనోట్లు.

ఆ నోట్ల నంబర్లు బ్యాంకులో వున్నాయి.

బ్యాంకువారా విషయం పేపర్లో వేయలేదు. దొంగ దొరకాలంటే నోట్ల నంబర్లు బ్యాంకువారికి తెలియవన్న భ్రమ అతడికుండాలి. అందుకే ఆ నంబర్లు దేశంలోని ప్రముఖ వ్యాపారస్థులకు, బ్యాంకులకు, పోలీసుస్టేషన్లకు

తెలియజేయబడ్డాయి.

మాటల సందర్భంలో ఒకసారి నవనీతరావు వెంకన్నకి విషయం చెప్పాడు.

“ఈ నోటు నంబరు మీ దగ్గరున్న నంబర్లతో సరిపోతుందేమో చూడండి....” అంటూ వెంకన్న ఓ వంద రూపాయల నోటుతీసి నవనీతరావు కందించాడు.

నవనీతరావు అప్పటికప్పుడు ఫైల్సు తెప్పించి వెరిఫై చేసి-“ఆశ్చర్యం-ఈ నోటు మీ కెక్కడిది?” అన్నాడు.

“అనుకోకుండా ఓ. పరిశోధనలో ఇది దొరికింది. నంబరు చూడగానే-అదేనా అని అనుమానం వచ్చింది.”

“అప్పుడెప్పుడో నేను చెప్పిన నంబర్లింకా మీకు గుర్తున్నాయా?” అని ఆశ్చర్యపడ్డాడు నవనీతరావు.

“నా జ్ఞాపకశక్తే నన్ను మంచి డిటెక్టివును చేసింది. ఆ విషయమలాగుంచండి. దొంగ గురించిన ఆచూకీ ఏమైనా తెలిసిందా?” అన్నాడు వెంకన్న.

“ఆ విశేషాలన్నీ మీకు తెలుసు—....”

వెంకన్నకవీ గుర్తున్నాయి.

దొంగను చూసిన వారతడ్ని వర్ణించారు. అప్పుడతడు మారువేషంలో వున్నాడు. అయినప్పటికీ వారు చెప్పిన వివరాలు బలదేవ్ కు సరిపోతాయి.

బలదేవ్ దొంగతనాల్లో ఆరితేరినవాడు. ఆతడు పట్టుబడ్డాడు.

బ్యాంకు దొంగతనానికి నాలుగు రోజులముందే అతడు జైలునించి విడుదలయ్యాడు. జైల్లో వుండగా అతడు చాలా నెమ్మదిగానూ, శాంతంగానూ వుండేవాడట. దొంగతనాలను పూర్తిగా మానేస్తానని ప్రతిజ్ఞ

పూనాడు.

జైలు వదిలేక వరుసగా నెలరోజులపాటు ప్రతిరోజూ అతడు పోలీస్ స్టేషన్ లో రిపోర్టుచేయవలసి వుంది.

కానీ అతడలా మూడురోజులు మాత్రం చేశాడు.

నాలుగోరోజున బ్యాంకు దొంగతనం జరిగింది.

బలదేవ్ పత్తాలేడు.

అతడి గురించి యెవ్వరూ వివరాలివ్వలేకపోయారు.

"బలదేవ్ ఫోటో మీ దగ్గరుంది కదూ!" అన్నాడు వెంకన్న.

నవనీతరావు తిరిగి మళ్ళీ రికార్డ్సు తెప్పించాడు.

అందులో బలదేవ్ ఫోటో వుంది.

"బలదేవ్ ను పట్టుకుంటే లక్షరూపాయల బహుమతి కదూ!"

"అవును...."

"మనమిద్దరం ఫిఫ్టీ ఫిఫ్టీ చేసుకుందాం—పదండి...." అన్నాడు వెంకన్న.

నవనీతరావాశ్చర్యంగా—"బలదేవ్ యెక్కడున్నదీ మీకు తెలుసా?" అన్నాడు.

"తెలుసు...."

"ఎక్కడున్నాడు?"

"ఒక అందాల పడుచుకు ముసలి మొగుడుగా నటిస్తున్నాడు. మనమతడింటికి పోలీసుల్లా వెళ్ళకూడదు. మీరు మఫ్టీలో రావడం మంచిది—"

"అసలిదంతా యేమిటో నాకర్థం కావడంలేదు...."

"దారిలో మీకన్నీ వివరంగా చెబుతాను...." అన్నాడు వెంకన్న.

9

ఇన్‌స్పెక్టర్ నవనీతరావు, డిటెక్టివ్ వెంకన్న రామకృష్ణయ్య ఇంటికి చేరుకున్నప్పుడు సమయం మధ్యాహ్నం మూడు గంటలు.

తలుపు తట్టగానే వేణి తలుపు తీసింది.

“రామకృష్ణయ్య గారున్నారా?” అన్నాడు వెంకన్న.

“నిద్రపోతున్నారు—....” అంది వేణి.

“ఒకసారి లేపగలరా?” అన్నాడు వెంకన్న.

“ఎందుకు?”

“నేనొక సినీ నిర్మాతను. అందులో ఒక పాత్రకు రామకృష్ణయ్యగారి నెన్నుకుందామని వచ్చాను”-అన్నాడు నవనీతరావు.

“ఆయనకు నటన తెలియదు—” అంది వేణి.

“నటన తెలియక్కర్లేదు. పెద్దగా డైలాగులు కూడా వుండవు....” అన్నాడు నవనీతరావు.

“ప్లీజ్—ఆయనొక్కసారి లేపండి—” అన్నాడు వెంకన్న.

“మీరెవరు? సినీ దర్శకులా?” అంది ఆమె.

“కరెక్టుగా ఊహించారు....” అన్నాడు వెంకన్న.

“ప్లీజ్—మీరు వెళ్ళిపొండి. ఆయనిలాంటి వాటికి ఒప్పుకోరు. మీ కెవరో తప్పుడు సమాచారమిచ్చారు....” అంది ఆమె.

“మా కెవరూ సమాచారమివ్వలేదు. మేమాయన్ను చూశాం. చూడగానే మా సినిమాలో మేమనుకుంటున్న పాత్రకు సరిగ్గా సరిపోతారనిపించింది. ఎంతైనా ఇస్తాను. ఆయన్నొప్పించండి—” అన్నాడు నవనీతరావు.

"డబ్బుకాయన లొంగరు. ఆయనకే బోలెడు డబ్బుంది—" అంది వేణి.

"ఒక్కసారి మాకు వారితో మాట్లాడే అవకాశ మిప్పించండి—" అన్నాడు నవనీతరావు.

"ఓ పట్టాన నిద్రపట్టదాయనకు. మధ్యలో నిద్రలేపడం అనారోగ్యమని డాక్టరు చెప్పాడు...."

"పోనీలెండి. ఆయన లేచేవరకూ వేచివుంటాం—" అన్నాడు వెంకన్న.

ఇక వాళ్ళు కదలరని గ్రహించి ఆమె వాళ్ళను కూర్చోమని చెప్పి తను లోపలకు వెళ్ళింది. ఆమె తిరిగిరావడానికి కాసేపు పట్టింది.

"ఆయన వస్తున్నారు. నేననుకున్నట్లు చిరాకుపడ లేదు. బహుశా ఒప్పుకుంటారేమో—" అంది ఆమె.

కాసేపట్లో ఓ వృద్ధు డక్కడికి వచ్చాడు.

వెంకన్న అతణ్ని పరిశీలించి చూశాడు. బలదేవ్ పోలికలు కనపడలేదు.

"నా పేరు రామకృష్ణయ్య—" అన్నాడతడు.

నవనీతరావు వచ్చిన పని చెప్పాడు.

"చాలా సంతోషం. జీవితంలో ఒక్కసారి కూడా స్టేజి ఎక్కలేదు. ఈ వయసులో సినిమాయోగం పడు తోందంటే నాకు చాలా అదృష్టం. కథేమిటో చెప్పండి—" అన్నాడతడు.

నవనీతరావు కథ చెప్పాడు. రామకృష్ణ వేయవలసిన పాత్ర గురించి కూడా చెప్పాడు. అది పరమ కిరాతకుడైన హంతకుడినే మార్చిన మహానీయుడి పాత్ర.

"ఇది వేస్తే మీకు శంకరాభరణం శంకరశాస్త్రి కంటె మంచి పేరు వస్తుంది—" అన్నాడు వెంకన్న

అతడు అప్పటికప్పుడో పోలరాయిడ్ ఫోటో తీశాడా వృద్ధుడికి.

"ఫోటో బాగా వచ్చిందికదూ—" అంటూ వృద్ధుడి కందించి చూపించి మళ్ళీ తిరిగి తీసుకున్నాడు.

కాసేపవీ యివీ కబుర్లు చెప్పుకున్నారు. కాఫీ లందేక మర్నాడు—అగ్రిమెంటు ఫారాలతో వస్తామని వెళ్ళి పోయారిద్దరూ. పారితోషికం పదివేలివ్వాలని కూడా నిర్ణయమయింది.

బయటకు వచ్చేక—"బలదేవ్ గనుక ఆ యింట్లో ఉంటే చాలా తెలివిగా ఉంటాడు. మననతడు తప్పక అనుమానిస్తాడు. పారిపోయే ప్రయత్నాలు చేయకుండా గట్టి కాపలా ఉంది కదా—" అన్నాడు వెంకన్న.

బయలుదేరే ముందే అందుకన్ని యేర్పాట్లూ చేశాడు నవనీతరావు.

ఇద్దరూ తిన్నగా పోలీసుస్టేషనుకు వెళ్ళలేదు. తమ వెనకో అనుసరిస్తున్నట్లుగా భావించుకుని—ఆ ఊహా వ్యక్తిని తప్పుదారి పట్టించడానికి నానావిధంగాను ప్రయత్నించి—అప్పుడు పోలీసుస్టేషనుకు వెళ్ళారు.

"బలదేవ్ పోలికలు లేవు ఫోటోలో వ్యక్తికి—" అన్నాడు వెంకన్న.

"అతణ్ని చూస్తే బలదేవ్ అనిపించలేదు నాకు. అతడు నిజంగానే వృద్ధుడు...." అన్నాడు నవనీతరావు.

"అందుకే అనుమానం తీర్చుకొందుకు ఫోటోమీద అతని వేలిముద్రలు పడేలా చేశాను—" అన్నాడు వెంకన్న.

ఇన్‌స్పెక్టరు వెంకన్నను మెచ్చుకున్నాడు.

బలదేవ్ వేలిముద్రల ఫోటోలు పోలీస్ స్టేషన్లో

వున్నాయి.

రాత్రి ఏడుగంటలకల్లా రిపోర్టు వచ్చింది.

ఫోటోమీద వేలిముద్రలు—బలదేవ్ వి కాదు.

"కొండను తవ్వి ఎలుకను పట్టాం—" అన్నాడు నవనీతరావు.

వెంకన్నకు చాలా అసంతృప్తిగా ఉంది.

"ఆ యింట్లో పూర్తిగా ఒక నోట్లకట్ట వుంది. అందులోని నోటిది. బలదేవ్ కీ వీళ్ళకి ఏదో సంబంధముంది...." అన్నాడతడు సాలోచనగా.

"వెంకన్నగారూ! మీరు తాపీగా ఆలోచించి చెప్పండి. నేను మీ కీ కేసులో తప్పక సాయపడతాను" అన్నాడు నవనీతరావు.

"ప్రస్తుతానికి ఇంటికి వెళ్ళడం మినహాగా వేరే ఆలోచన లేదు—" అన్నాడు వెంకన్న. అతడిల్లు చేరువనే సరికి — అసిస్టెంట్సిద్దరూ వెళ్ళిపోయారు. పద్మావతి కోపంగా—"ఏమైపోయారు మీరు?" అంది.

వెంకన్న తన జేబులోంచి రెండు ఫోటోలు తీసి—"వీళ్ళిద్దరు. ఒకటని బుజావు చేయాలని ప్రయత్నించి ఫెయిలయ్యాను—...." అన్నాడు.

"ఎవరు వీళ్ళు?" అంది పద్మావతి భర్త యిచ్చిన ఫోటోలు చూస్తూ.

"వీళ్ళలో ఒకరు నీకు తెలుసు —...." అన్నాడు వెంకన్న.

"వీళ్ళిద్దర్నీ నేనెప్పుడూ చూడలేదు—" అంది పద్మావతి.

"డిటెక్టివ్ భార్యవు. జ్ఞాపకశక్తి బాగుండాలి. ఉదయం రామకృష్ణయ్యను చూసివచ్చావుగా—అయ

న్నప్పుడే మర్చిపోయావా?" అన్నాడు వెంకన్న.

"అప్పుడే యెందుకు మర్చిపోతాను? కొంపతీసి ఈ ముసలాయన ఫోటో — రామకృష్ణయ్యదే అనరుగదా మీరు——....!" అంది పద్మావతి.

"వాట్!" అని ఉలిక్కిపడ్డాడు వెంకన్న. అంతే— అతడు తక్షణం నవనీతరావుకి ఫోన్ చేసి—"డియర్ నవనీతరావుగారూ! నిర్భయంగా మీరు రామకృష్ణయ్య యింటిపై దాడిచేయండి. అక్కడ మీకు బ్యాంకు దొంగతనం నోట్లు దొరుకుతాయి. ఇంట్లో ఎవరుంటే వాళ్ళని అరెస్టు చేయండి. బహుశా బలదేవ్ కూడా అక్కడే వుంటాడు" అన్నాడు.

10

బలదేవ్ పట్టుబడ్డాడు.

అతడు ప్రశాంతమైన జీవితాన్ని కోరి పూర్వాశ్రమంలో తనకు పరిచయురాలైన యువతిని పెళ్ళాడి— తను వృద్ధ వేషంలో ఆమెతో కాపురం ప్రారంభించాడు. తన్నెవరూ అనుమానించకూడదనీ—తనవద్ద నున్న డబ్బు సులభంగా బయటపడకూడదనీ అతడనుకున్నాడు. మరో సంవత్సరం అజ్ఞాతవాసం చేశాక — తన దగ్గర వున్న డబ్బుతో సుఖపడాలనుకున్నాడు.

అతడు తనింట్లో సాయానికి మరో వృద్ధుడి నుంచుకున్నాడు. ఈ వృద్ధుడికి నా అన్నవాళ్ళెవ్వరూ లేరు. బలదేవ్ వృద్ధుడు కాదన్న రహస్యం అతడికి తెలియదు. స్వంత తమ్ముడిలా తన నాదరిస్తున్న బలదేవ్ అంటే అతడికెంతో అభిమానం. అవసరమైనప్పుడు తనకు డూప్ గా అతణ్ని వాడుకోవాలని బలదేవ్ యింట్లో వుంచుకున్నాడు.

వాళ్ళకు రోజులు బాగానే గడచిపోతున్నాయి. తన దగ్గరున్న డబ్బును తెలివిగా మార్చుకుంటూ వస్తున్నాడు బలదేవ్ — వేణి సహాయంతో.

ఈ రోజు ఉదయం పద్మావతి రావడమూ — ఆ తర్వాత సినీనిర్మాతలు రావడమూ బలదేవ్‌లో కొంత అనుమానాన్ని సృష్టించాయి. అందుకే అతడు తన స్థానంలో వృద్ధుణ్ని పంపించాడు. అతడిని వెంకన్న అనుమానించకపోవడంతో పద్మావతికి — వారికి సంబంధం లేదని రూఢి చేసుకున్నాడు. వాళ్ళు నిజంగానే సినీ నిర్మాతలే అయితే వృద్ధుడిని పంపాలని బలదేవ్ అనుకొన్నాడు. తర్వాత అతడు రామకృష్ణయ్య కాదని తెలిస్తే — తనకు సినిమాలంటే యిష్టంలేక వదుల్చుకుందుకు వృద్ధుణ్ని పంపానని చెప్పవచ్చు ననుకున్నాడు. వాళ్ళు పోలీసులే అయితే ఆ వృద్ధుడిలో బలదేవ్ పోలికలు దొరక్క — అతడి వేలిముద్రలలో సరిపోక — తర్వాత మళ్ళీ తనను బాధించరని అతడనుకున్నాడు.

కానీ అతడి పథకం బెడిసికొట్టింది.

రామకృష్ణయ్య నిజంగా వృద్ధుడు కాకపోవడంవల్లనే అతడి భార్య వేణి — అతణ్ని ఆరాధిస్తున్నదని తెలిసి ఉమాపతి నీరసపడి వెంకన్నను కలుసుకొన్నాడు.

"ఉమాపతిగారూ! చాముండేశ్వరిని అపురూపంగా చూసుకోండి. దేవతగా ఆరాధించండి. ఆమె మిమ్మల్ని యువకభర్తను మించి ఆరాధిస్తుంది. యువకులంటే ఆమె కసహ్యం. అది పోవాలంటే — ఈ సమాజం మారాలి. అదిప్పట్లో జరిగే పనికాదు. మీ దాంపత్య జీవితం జయప్రద మవుతుంది. నేను చెబుతున్నాను — ...." అన్నాడు వెంకన్న.

ఈ సలహా ఉమాపతికి బాగా నచ్చింది—"వెంకన్న గారూ! మీరు నా కోసం శ్రమపడి చాలా విశేషాలు తెలుసుకున్నారు. రామకృష్ణయ్య వృద్ధుడై వుండీ—నా కంటే ఎక్కువగా భార్య చేత ఆకర్షించబడడం—మానసికంగా నన్ను దెబ్బతీసింది. ఇప్పుడు నా కంతో ధైర్యంగా వుంది. నేను శారీరకంగా వృద్ధుణ్ని కాను...." అని—"మీ కెంత ఫీజు కావాలో చెప్పండి. అంతా యిచ్చుకుంటాను—" అన్నాడు.

వెంకన్న డ్రాయరు సొరుగు లాగి—అయిదు వేల రూపాయలు బయటకు తీసి—"మీ రిచ్చిన రెండు వేలకూ జతపర్చుకుని మూడు వేలిస్తున్నాను. ఈ అయిదు వేలూ నేనే మీకు ఫీజుగా యిచ్చుకుంటున్నాను. లేదా మీ కిది నా పెళ్ళికానుక అనుకోండి. ప్రభుత్వానికి పాతికలక్షల నష్టం చేకూర్చిన ఓ దొంగను పట్టుకోవడంలో మీ పాత్రకు ప్రతిఫలముండాలి కదా!" అన్నాడు.

సరిగ్గా అప్పుడే బల్లమీద ఫోన్ మ్రోగింది. వెంకన్న ఫోన్ ఎత్తాడు.

"ఈ కేసు నా పరిశోధన. మీరు నా అసిస్టెంటు. నా అనుమతి తీసుకోకుండా ఇతరులకు—మన బహుమతి మొత్తంలో వాటా యిచ్చే అధికారం మీకు లేదు—" అంది పద్మావతి.

వెంకన్న ఆమెకు బదులిచ్చేలోగా—డిటెక్టివ్ తనకు ఫీజిస్తున్నా డేమిటని భయపడ్డాడో, చాముండేశ్వరిని కలుసుకుందుకు కంగారుపడ్డాడో—అక్కణ్నించి పరుగున వెళ్ళిపోయాడు ఉమాపతి.

—:అయిపోయింది:—